

ఎన్నారై ముచ్చట్లు

-సత్యం మందపాటి



(గతసంచిక తరువాయి)

21. బానిసలమండీ, బానిసలం!

నేను నాలుగున్నర దశాబ్దాల పైన భారతదేశంలో నివసించేటప్పటినించీ నన్ను వెంటాడుతున్న విషయం ఒకటున్నది. ఆరోజుల్లో తెలుగు ఇంగ్లీషు పుస్తకాల్లోనూ, వార్తాపత్రికల్లోనూ చదివినవీ, ఇండియాలో చూసిన కొన్ని సంఘటనలూ నన్ను కలత పెట్టేవి. కొన్ని శతాబ్దాలుగా అప్పటినించీ ఇప్పటిదాకా, తెల్లవారు నల్లవారిని బానిసలుగా చేసుకుని వారిని హింసించిన సంఘటనలూ, మనదేశంలోనే అంతకు ముందు రోజుల్లో భూస్వాములూ, ఇతర అగ్రకులాలవారూ హరిజనులని బానిసలుగా చూసి వెలివేసిన సంఘటనలూ కలవరపెట్టేవి.

ఒక మనిషి తన సాటి మనిషిని బానిసలా చేసుకుని, వారిని గానుగ ఎద్దుల్లా తయారు చేసి, వెట్టి చాకిరి చేయిస్తూ వారి జీవితాలని సర్వనాశనం చేయటంలో వాళ్ళ ఉద్దేశ్యం ఏమైవుంటుంది అని. వాళ్ళలో మానవత్వం ఏమయింది అని. అసలు అలాటి మనస్తత్వం మనుష్యుల్లో ఎందుకు వుంటుంది అని.

తర్వాత అమెరికాకి వచ్చాక అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాల్లో నల్లవారి మీద తెల్లవారు చూపించిన, ఇప్పుడు కూడా ఇంకా చూపిస్తున్న ఆ బానిసత్వం, ఆ జాత్యహంకారం పుస్తకాల్లో చదవటం, హాలీవుడ్ సినిమాల్లో చూడటం ఎక్కువ చేశాను. అంతేకాదు అలాటి మంచి పుస్తకాలు చదివినప్పుడు, డాక్యుమెంటరీలు, నిజజీవిత సినిమాలు చూసినప్పుడు, వాటి మీద కుతూహలమున్న మిత్రులకి చెబుతూనే వున్నాను. మరింత అవగాహన కోసం వారితో అలాటి విషయాల మీద చర్చలు చేస్తూనే వున్నాను. 'సెల్మా', 'మార్షల్', 'రోసా పార్క్స్ స్టోరీ', 'ఫ్రీ స్టేట్ ఆఫ్ జోన్స్' లాటి బయోపిక్ సినిమాలు చూస్తుంటే, మన కళ్ళల్లో నీళ్ళు రాకమానవు. నల్లవారి వీపుల మీద కొట్టిన కొరడా దెబ్బల రక్తపు గీతలు, వారిని హింసించి చెట్లకి తల్లక్రిందులుగా కట్టేసి చనిపోయేదాకా అలా వదలి వేసిన సంఘటనలూ, ఒకసారి చూస్తే ఆజన్మాంతం మన మనసుల్లో అలాగే నిలచి బాధపెడుతుంటాయి.

ప్రెసిడెంట్ లింకన్‌తో మొదలై, ప్రెసిడెంట్ జాన్సన్ జాతి, రంగు, లింగ బేధాల్లేకుండా అందరినీ సమానంగా చూడాలని చేసిన చట్టాలు అక్కడక్కడా ఆచరణలో అవకతవకలు వున్నా చాలవరకూ పనిచేశాయి. నాలాటి మీలాటి

బ్రౌనుదొరలు, చైనీస్ జపనీస్‌లాటి పసుపు పచ్చ ఆసియావాసులు, ఎన్నో రకాల సంస్కృతుల, రంగులవారూ, అమెరికాలోనూ ఇతర తెల్ల దేశాల్లోనూ మంచి ఉద్యోగాలు చేసుకుంటూ నివసించటం దానికి మంచి ఉదాహరణ.

ఇక్కడ ఒక విషయం చెప్పి తీరాలి. ఆనాటి భారతదేశంలో ఈ విషయపరంగా అగ్రకులాల వారందరూ ఎంత చెడ్డవారు కాదో, అలాగే అమెరికాలో డెబ్భై శాతం పైగా తెల్లవారు జాత్యహంకారులు కాదు. కాకపోతే ఒక గ్లాసెడు పాలలో, ఒక్క బొట్టు విషం వేస్తే చాలు, మొత్తం ఆ గ్లాసెడు పాలనీ విషపూరితం చేయటానికి. ఇండియాలో ఎందరో అగ్రకులాల వారు నిమ్న జాతుల పరిరక్షణకు ఎలా పాటుపడ్డారో, అలాగే ఎందరో తెల్లవారు నల్లవారి హక్కుల కోసం అమెరికాలోనూ పోరాడారు.

కాకపోతే ప్రస్తుత అమెరికాలో కెకెకె (కు క్లక్స్ క్లాన్)లాటి శ్వేత అహంకార గ్రూపులతో చేతులు కలిపి, ప్రతి ఎన్నికల మీటింగుల్లోనూ తన జాత్యహంకారం చూపించి ఎన్నికయిన ఇప్పటి అమెరికా అధ్యక్షుడు, మళ్ళీ దేశాన్ని వందేళ్ళు వెనక్కి తీసుకువెళ్ళాడు. శ్వేతజాతి వివక్షతతో తెల్లవారు కానివారిని తొక్కిపెట్టటమనే లక్ష్యంతో, ఏనాడో హిట్లర్ చేసిన పనులు ఈనాటి సభ్య సమాజంలో మళ్ళీ మొదలుపెట్టాడు. అమాయకులైన నల్లవారిని పోలీసులు అకారణంగా అరెస్ట్ చేయటం, కొండొకచో వాళ్ళని పిట్టల్ని కాల్చినట్టు కాల్చేయటం ఎంతో ఎక్కువయింది. నాలుగేళ్ళ వయసునించీ పదేళ్ళ వయసున్న మెక్సికన్ పిల్లల్ని వారి తల్లిదండ్రులనించీ విడదీసి, నెలల తరబడి కాన్సన్ట్రేషన్ కాంపుల్లో పెట్టటం హిట్లర్ రోజుల్లో విన్నాం. మళ్ళీ ఇప్పుడే వింటున్నాం. అసలు సిసలు ఉగ్రదేశాలతో స్వంత వ్యాపార సంబంధాలు పెట్టుకుని, ఉగ్రవాదులతో ఏమాత్రం సంబంధంలేని అమాయక ముస్లిం దేశాలనించీ వలస వచ్చిన అమెరికా నివాసులనీ, పౌరసత్వమున్నవారినీ బహిరంగంగానే బహిష్కరించటం రోజూ వింటూనే వున్నాం. మన భారతీయులని కూడా, మా బంధుమిత్రులతో సహా (వారందరూ అమెరికన్ పౌరులే!) రోడ్డు మీద ఆపి అర్థంలేని ప్రశ్నలు వేసి వేధించటం చూస్తూనే వున్నాం. చక్కగా ఉద్యోగం చేసుకుంటున్న భారతీయులనీ, ఇతర దేశాలవారినీ హెచ్–వన్ వీసాల కాలపరిమితి పెంచకుండా ఆపేసి, అప్పటికప్పుడు దేశం వదలి పొమ్మనటం ఎక్కువయింది. మా ఎదురింటబ్బాయి హెచ్–వన్ వీసాని పెంచకుండా ఆపేసి వారంరోజుల్లోపల దేశం వదిలి వెళ్ళమన్నారు. అతను ఇల్లు అమ్మలేక, అద్దెకివ్వలేక, ఎన్నో అవస్థలు పడి భార్యా పిల్లలతో సహా ఇల్లు, దేశం రెండూ వదిలేసి హడావిడిగా వెళ్ళిపోయాడు.

ప్రపంచ చరిత్ర చదివినా ఇలాటి ఉదాహరణలు ఎన్నో కనిపిస్తాయి. శ్రీశ్రీగారు చెప్పినట్టు ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం, నరజాతి చరిత్ర సమస్తం పర పీడన పరాయణత్వం. ఎక్కడినించో వచ్చిన నవాబులు, బ్రిటిష్ వారు మన భారతదేశాన్ని ఆక్రమించటమే కాకుండా, మనల్ని బానిసలుగా చేసుకుని, కాలి క్రింద తొక్కిపెట్టి మరీ పరిపాలించారు. ఆ బానిసత్వం మనల్ని ఇంకా వదిలిపెట్టలేదు. రాజకీయ నాయకులకి, గవర్నమెంట్ ఆఫీసర్లకి వంగి వంగి దణ్ణాలు, సాష్టాంగ నమస్కారాలు చేసే వాళ్ళని చూస్తుంటే, స్వార్థం కోసమో మనుగడ కోసమో తమకు తామే కోరుకునే ఈ బానిసత్వం ఎలా వుంటుందో చూడవచ్చు.

ఇవన్నీ చూస్తుంటే నా ఆలోచనలు రకరకాలుగా కట్టలు తెంచుకున్నాయి. ఇలా తమ రంగు, జాతి, కులం, మతం కాని వారి మీద వివక్షత, అసహ్యం, ద్వేషం చూపించి, వారిని బానిసలుగా చూసే వారందరూ తమ మతాల మీద, దేవుళ్ళ మీద ప్రేమ వున్నవాళ్ళే. పేరుకి సాంప్రదాయకులమని (Conservatives) చెప్పుకునేవారే! మరి ఏ మతమూ, దేవుడూ ఇతరులనిలా విచక్షణా జ్ఞానం లేకుండా వివక్షత చూపించమనీ, బానిసలుగా చూడమనీ, వారిని తొక్కిపెట్టమనీ చెప్పలేదే! క్రిస్మస్ పండగ రోజుల్లో కుటుంబాలు కలిసి వుండే సమయంలో ఇలా పిల్లల్ని తల్లిదండ్రుల నించీ వేరు చేయమని ఏ మతమూ చెప్పలేదే! మరి జంతువుల్లో కూడా సహజంగా వుండే ఈ ప్రేమ, అనురాగం, మమత మనుష్యులలో ఎలా మాయమయింది? దాని బదులు ద్వేషం ఎలా చోటు చేసుకుంది? అసలీ మనస్థత్వం ఎక్కడినించీ వస్తుంది? పుట్టినప్పుడు పిల్లలందరూ స్పటికమంత స్వచ్ఛంగా వుంటారే, మరి ఈ తేడాలు పెంపకంలో వస్తాయా? చుట్టూ వున్న సమాజం అలావుంటే, సమాజంలోనించీ వచ్చిందనుకోవచ్చు, కానీ అన్ని సమాజాలూ అలా లేవే! సమాజాలకు సమాజాలే అలా మారుతున్నాయా? ఎందుకు?

ఇలాటి బానిసత్వానికి మూడు కారణాలు అవవచ్చు అనుకుంటున్నాను. ఒకటి దురాశాపూరిత ధనమదం, రెండు రాజ్య కాంక్ష (ఈరోజుల్లో పదవీ వ్యామోహం), మూడు హింసానందం (శాడిజం).

పూర్తి విశ్లేషణకి జవాబులు నా అంతగా దగ్గర లేవు. ఇంకా ఎంతో శోధించాలి.

నా మనసులోని ప్రశ్న మాత్రం ఒక్కటే, 'మానవత్వమా ఎక్కడున్నావ్?' అని.

మనమందరం సత్యాన్వేషణ చేసుకోవలసిన విషయం ఇది!

o o o

ఇప్పటిదాకా, చాలా సీరియస్‌గా వుంది ఈ వ్యాసం. అందుకని కొంచెం గేర్లు మారుద్దాం.

బానిసత్వంలో ఇంకొక రకమైన బానిసత్వం కూడా వుంది.

ఇందాక చెప్పుకున్నది స్వార్థం, వివక్షత, ద్వేషం తలకెక్కాక ఇతరులని బానిసలుగా చూసి అణగద్రొక్కేది.

ఇప్పుడు చెప్పబోయేది, మనంతట మనమే (దాదాపు తొంభై శాతం మనుష్యులు) ఈ రోజుల్లో కావాలని, ఎలా బానిసలుగా మారుతున్నారో చెబుదామని.

o o o

నేను కాకినాడ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగులో 1960 దశాబ్దం మొదట్లో చదువేటప్పుడు, డాక్టర్ వెంకటరత్నంగారని ఒక ప్రొఫెసర్‌గారు ఉండేవారు. ఆయన ఆరోజుల్లో అంటుండేవారు, "Man has invented so many gadgets, but he became a slave to his own creation" అని.

ఎందుకో నా మనసులో ఆ మాటలలా నిలచిపోయాయి. నిజంగా ఈరోజుల్లో వున్నన్ని పరికరాలుకానీ, మెషీన్లుకానీ అప్పుడు లేవు. అప్పటికన్నా ఇప్పుడే మనమే సృష్టించుకున్న సాంకేతిక పరికరాలకూ, పరిజ్ఞానానికీ మనం పూర్తిగా బానిసలమై పోయామనిపిస్తున్నది.

నేను నా 'సత్యమేవ జయతే!' పుస్తకంలో 'సైబరుడి శాపం' అని ఒక వ్యాసం వ్రాశాను. సరదాగా వ్రాసిన ఆ వ్యాసం నాకెంతో ఇష్టమైన వ్యాసమే కాకుండా, ఎంతోమంది పాఠకులకి నచ్చి మెచ్చుకున్నది కూడాను.

దానిలో సైబారారణ్యంలో సైబర మహాముని ఘోర తపస్సు చేసుకుంటుంటే, పిల్లలతో సహా ఆ అరణ్యానికి కారులో వెడుతున్న ఒక కుటుంబం కంటపడ్డాడా మహాముని. అమాయకులైన ఆ పిల్లలు ఆయన తపస్సుని భగ్నం చేస్తే ఆయనకి కోపమొచ్చింది. అన్యోన్యంగా ఉండాల్సిన కుటుంబాలు రాబోయే సైబరయుగంలో సాంకేతిక పరికరాలకి బానిసలైపోయి, మానవ సంబంధాలకు దూరమవుతారని శాపం పెడతాడు. ఆ శాపం వల్లనే ఇప్పుడు మనమిలా తయారయామని కథాంశం.

ఇంతకు ముందు భార్య పుట్టిన రోజున భర్తగారు ప్రొద్దున్నే భార్య బుగ్గ మీద ఒక ముద్దు పెట్టి, 'పుట్టినరోజు శుభాకాంక్షలు బంగారం!' అనేవాడు. ఇప్పుడయితే ముఖపుస్తకంలో, 'హాపీ బర్త్ డే హనీ' అని బాత్రూమునించీ పెట్టేస్తాడు. అతని భార్య టీవీ చూస్తూ 'థాంక్స్' అని పెట్టేస్తుంది. అంతేకాదు అతని పోస్టింగుకి లైక్ కూడా ఇస్తుంది.

ఇంతకుముందు కాళ్ళకి చక్రాలు కట్టుకుని ఆఫీసు పనిమీద ఊళ్ళు తిరిగే చక్రధరరావు తమ వివాహ వార్షికోత్సవంనాడు ఇంటికి గులాబీ పూలగుత్తి పంపిస్తే, ఆ ఇంతి సంతోషం పట్టలేకపోయేది. ఇప్పుడు టెక్స్ట్ మెసేజిలో ఒక పూలగుత్తి ఇమోజి పంపిస్తాడు రామోజి. అతని భార్య స్పందన దానికి స్పందించి, ముందు లైక్ కొట్టి, వెంటనే మనసు మార్చుకుని 'లవ్' చేస్తుంది. స్పందన గాఢ స్నేహితురాలు స్నేహ మాత్రం, స్పందనకి ఇష్టమైన చాకొలెట్ కోటెడ్ ఆల్మండ్స్ పాకేజి పెట్టె బొమ్మని వాట్సప్లో పంపిస్తుంది. 'వావ్, ఐ లవిట్' అని జవాబిస్తుంది స్పందన.

ఇంతకుముందు రాత్రి భోజనాల దగ్గర అందరం కలిసి కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తినేవాళ్ళం. ఇప్పుడు కుడి చేత్తో అన్నం తింటూ, ఎడమ చేతితో సెల్ఫోన్ని చెవికి ఆనించుకుని మాట్లాడుతుంటుంది భార్యామణి. నిర్మలతో మాట్లాడటం అవకముందే, లలిత పిలుస్తుంది. ఆవిడని హోల్డులో పెట్టి, ఈవిడకి బై చెప్పి, ఆవిడని ఫోన్లో పెట్టి, 'హలో, బాగున్నారా? భోజనమా? ఎప్పుడూ వుండేదేగా... చేస్తున్నాం. ఫరవాలేదు చెప్పండి.' అంటుంది. పక్కనే ఐపాడ్ పెట్టుకుని పిల్లల కార్టూన్ పాటలు పెట్టుకుని వింటూ, అదే చేతి వేలితో కార్టూన్లు మారుస్తూ, ఒక్కొక్క మెతుకే తింటూ కూర్చుంటుంది నాలుగేళ్ళ నర్మద. ఆ పిల్ల తినే కూర, పప్పు, పెరుగు అన్నీ ఐపాడ్ బుల్లి తెర మీద పులుముకుని వుంటాయి. ఐపాడ్ ఆగిపోతే ఆ పిల్ల తినటం కూడా ఆగిపోతుంది. ఇంటాయన మాత్రం మౌనంగా టీవీలో వస్తున్న బేస్ గేమ్ చూస్తూ, మధ్యే మధ్యే కొంచెం కొంచెం తింటూ తన లోకంలో తనుంటాడు. మధ్యలో బాస్కెట్ బాల్ గేమ్ గుర్తుకి వచ్చి, 'అలెక్సా, చేంజ్ ది ఛానల్ టు ఫార్టీ నైన్' అంటాడు.

నలభై ఐదేళ్ళ క్రితం నేను సోఫాలో పడుకుని, 'అనంత్, టీవీ ఛానల్ని నలభై తొమ్మిదికి మార్చు నాన్నా. అక్కడ బాస్కెట్ బాల్ గేమ్ వస్తుంది' అనే వాడిని, మా పదేళ్ళ అబ్బాయితో. అప్పుడు అలెక్సా లేదు. కనీసం టివీ రిమోట్ కంట్రోల్ కూడా కనిపెట్టలేదు. ఇప్పుడు మా అలెక్సా లైట్లు, ఫాన్లు వెలిగిస్తుంది, ఆర్పుతుంది. ఘంటసాల, బాలు, సుశీల పాటలు పాడమంటే పాడుతుంది. (పాడదు, పాటలు పాడిస్తుంది).

ఆడవాళ్ళయితే ఫేస్ బుక్కులో లైకులు కొడుతూ, 'అలెక్సా. స్విచ్ ఆన్ ది రైస్ కుక్కర్, మైక్రోవేవ్, కాఫీ పాట్.. అంటుంటే అలెక్సా అలా చేస్తుంటుంది. 'అలెక్సా పెసరట్లు వేయి, బొబ్బట్లు చేయి..' అంటే అవి చేసే స్థాయికి మన సాంకేతిక రంగం ఇంకా ఎదగలేదు. అదీ ఎన్నాళ్ళో లేదు. ఏఐతో త్వరలోనే అదీ వస్తుందనుకుంటాను.

ఈమధ్య ఒక పెళ్ళిలో చూశాను. పురోహితుడుగారు, ఒక పక్క సెల్ ఫోన్లో మాట్లాడుతూనే, పెళ్ళి కూతురి తండ్రితో 'అయ్యా, ఆ నీళ్ళు అక్కడ ఆకు మీద చిలకరించండి', 'అక్షితలు చల్లి నమస్కారం పెట్టండి' అంటున్నాడు. నాకేమనిపిస్తుందంటే, ఆరోజుల్లో రాజులు యుద్ధానికి వెళ్ళి, కత్తికి భాష్యం కట్టి లాంగ్ డిస్టెన్స్ పెళ్ళి చేసుకున్నట్టు, ఇప్పుడు కూడా లాంగ్ డిస్టెన్స్ పెళ్ళిళ్ళు సైబర్ కల్యాణ మండపాల్లో జరుగుతాయేమోనని.

పదిమందీ కూర్చుని విష్ణు సహస్రనామం చదువుతున్నప్పుడు ఎవరిదో ఫోన్ మ్రోగితే, నారాయణతో సహా నలుగురు తమ ఫోనేనేమో అని చూసుకుంటున్నారు.

'హే గూగుల్' కూడ అలెక్సాలాగానే బయట వాతావరణం ఎలా వుందో చెబుతుంది. మా ఆస్టిన్లోనే కాదు, ఇండియాలో గుంటూరులో వాతావరణం కూడా చెబుతుంది. ఒక డాలరుకి ఇప్పుడు రూపాయలెన్నో చెబుతుంది. నాలుగు వందల నాలుగుని, ఆరువందల తొంభై తొమ్మిదితో హెచ్చవేసి చెప్పమంటే వెంటనే చెప్పేస్తుంది. మనం హాయిగా కూర్చుని ఉల్లిపాయ పకోడీలు తింటూ వాటికి బానిసలమై పోయాం. ఎప్పుడయినా అవి కొంచెంసేపు పని చేయకపోతే చేతులూ కాళ్ళూ ఆడవు. బ్లడ్ ప్రషర్ చకచకా పెరిగిపోతుంది. ఎవరో ఆత్మీయుల్ని కోల్పోయినట్టు అనిపిస్తుంది.

ఇలా చెప్పుకుంటూ పోతుంటే... ఎన్నో... ఎన్నో... నిత్యం మనం చూసేవే, చేసేవే.

మరి ఎందుకు మనం సృష్టించుకున్న పరికరాలకు మనమే అంతగా బానిసలమయిపోయాం? ఒక్క గంట ఇంటర్నెట్ పనిచేయక పోతే విలవిల్లాడతాడు వినయ్. ముఖపుస్తకం ముఖై నిమిషాలు ముఖం చాటేస్తే, ముఖం మాడ్చుకుంటుంది ముక్త. అలెక్సా చెప్పిన మాట వినిపించుకోకపోతే కోపంతో అరుస్తాడు అరవింద్. అలెక్సా మీద కాదు. పెళ్ళాం మీద.

ఈ పరికరాల వల్ల మన జీవతం సుఖవంతం అవుతుంది కదా, అందులో తప్పేమిటి అనేది ఒక వాదన.

అన్నీ ఆ పరికరాలే చేస్తుంటే, ఇక బుర్ర ఉపయోగించటం తగ్గిపోతున్నది అనేది ఇంకొక వాదన.

బయట ఆటలు ఆడుకునే పిల్లలు, ఇప్పుడు కంప్యూటర్లో ఆడుకుంటున్నారు.

పెద్దలు నడక మానేసి, టీవీకి అంకితమైపోయారు.

శరీరానికి అవసరమైన వ్యాయామం లేక ఎంతోమంది లావయిపోతున్నారు. ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయి అంటున్నారు. మరచిపోయాను, ఇప్పుడు వ్యాయామం కూడా కొందరు వ్యాయామం యాప్‌లోనే చేస్తున్నారు.

మరి... ఇలాటి బానిసత్వం మంచిదా... కాదా?

మీరే చెప్పండి చూద్దాం!

○ ○ ○

(మరో ముచ్చట వచ్చే నెలలో)

COMMENTS